క్లుప్తంగా

పేటలో మళ్లీ వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తాం...



ఉద్దండపురంలో ఎంపీ, ఎమ్మెల్యేను సత్కరిస్తున్న నాయకులు

నక్కపల్లి : రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులును బుధవారం ఉద్దండపురం గ్రామంలో స్థానిక నాయకులు ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పాడగట్ల వెంకటేష్, ఎంపీటీసీ బచ్చలరాజు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జిల ఆధ్వర్యంలో నాయకులంతా వీరిని దుశ్శాలువ, పూలబొకెలతో స్వాగతం పలికి సత్కరించారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి జోగులును గెలిపించి జగనన్నకు కానుకగా ఇస్తామన్నారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షులు మణిరాజు, పాపారావు, తాతబాబు, పార్టీ నాయకులు గోవిందు, శేషారత్నం, గొర్లబాబూరావు, రామకృష్ణ, అప్పలరాజు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు ఎమ్మెల్యే అభినందన



సూర్యనారాయణను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

రాంబిల్లి : యలమంచిలి నియోజకవర్గ సచివాలయ కన్వీనర్‌గా ఎంపికైన ఎస్.వి. సూర్యనారాయణను బుధవారం ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)అభినందించారు. ఇటీవలే సూర్యనారాయణ ఉపాధ్యాయ ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేశారు. ఆయన భార్య శారద గోకివాడ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేస్తున్నారు. సూర్యనారాయణను డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కిషోర్ అభినందించారు.

జగనన్న సురక్షలో 318 మందికి వైద్యం



ఎర్రవరం వైద్యశిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

యలమంచిలి రూరల్: పేదలకు కూడా నాణ్యమైన వైద్యాన్ని ఉచితంగా అందించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తోందని మున్సిపల్ మేనేజర్ డి.ప్రభాకర్రావు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధి ఎర్రవరంలో రెండో విడత జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైద్య శిబిరంలో మొత్తం 318 మందికి వైద్యసేవలందించారు. అవసరమైన రోగులకు జగనన్న సురక్ష మందుల కిట్‌లను ఉచితంగా అందజేశారు. స్పెషలిస్టు వైద్యులు ఎస్.ఝాన్సీరాణి (గైనకాలజిస్టు), జైదీప్(ఎంబీబీఎస్), ప్రసాద్(ఈఎన్‌టీ), ఇ.లీల(ఆప్తాల్మాలజిస్టు), వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

అనకాపల్లి : గవరపాలెం సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర వాణిజ్య, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆలయ పాలక వర్గ సభ్యులకు సూచించారు. మండలంలో పిసినికాడ సీఎం జగన్ సభాస్థలి వద్ద బుధవారం ఆయన శివరాత్రి ఉత్సవాల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు

అనకాపల్లి : టెన్త్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఇష్టపడి చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని జీవీఎంసీ వేల్పులవీధి హైస్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ విల్లూరి హరికృష్ణ అన్నారు. బుధవారం హైస్కూల్ ఆవరణలో టెన్త్ విద్యార్థులకు ఫేర్‌వెల్ పార్టీ జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఏడాది పదో తరగతి పరీక్షల్లో ఎక్కువగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

గ్రామ స్వరాజ్య స్థాపనే సీఎం ధ్యేయం



డీఎల్‌పురంలో సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు



మంగవరంలో సామాజిక భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, కంబాల జోగులు

- సచివాలయాలతో ప్రజల వద్దకే పాలన
- ఎంపీ సత్యవతి, ఎమ్మెల్యేలు బాబూరావు, కంబాల జోగులు
- పలు గ్రామాల్లో సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లకు ప్రారంభోత్సవం

నక్కపల్లి: బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని స్థాపించి సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల చెంతకే చేర్చిన ఘనత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఎంపీ డాక్టర్ సత్యవతి, ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, సమన్వయకర్త, ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. బుధవారం మండలంలో డీఎల్‌పురం, గునిపూడి, చినదొడ్డిగల్లు, ఉద్దండపురం గ్రామాల్లో నిర్మించిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎక్కడా లేని విధంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి 12 ప్రభుత్వ శాఖల సిబ్బందిని నియమించి ప్రజలకు సుమారు 500 రకాల ప్రభుత్వ సేవలను అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మండల కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సచివాలయాల ద్వారా గ్రామాల్లో ప్రజలు కనీస అవసరాలు, కావాల్సిన ధ్రువపత్రాలు పొందుతున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా దళారుల అక్రమాలకు చరమగీతం పాడారన్నారు. రైతులకు ఖరీఫ్, రబీ సీజన్‌లలో కావాల్సిన విత్తనాలు, ఎరువులు గ్రామాల్లోనే సరఫరా చేయడంతో పాటు గ్రామాల్లోనే పశువైద్యం సైతం అందిస్తున్నారన్నారు. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు సైతం ఇళ్ల వద్దకే తెచ్చి అందిస్తున్నారన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఈ వ్యవస్థలన్నీ రద్దు చేస్తారని, మళ్లీ జన్మభూమి కమిటీల హవా వస్తుందని, దోపిడీ మొదలవుతుందని అన్నారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కుతున్నారన్నారు. పొత్తుల పేరుతో అధికారంలోకి రావడానికి అమలు సాధ్యం కాని హామీలు ఇస్తున్నారని, ప్రజలు గమనించాలని కోరారు. మంచి చేశాం కాబట్టే మాకు ఓటేయమని ప్రార్థిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు మణిరాజు, పాపా రావు, మండల పార్టీ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, జేసీఎస్ కన్వీనర్ గోవిందు, సర్పంచ్‌లు చినపేర్రాజు, నూకరత్నం, వెంకటేష్, కిల్లాడ రా మకృష్ణ, సురేష్ వర్మ, ఎంపీటీసీలు చంద్రరావు, సత్తిబాబు, కృష్ణ, బచ్చలరాజు పాల్గొన్నారు.

ప్రతి గ్రామంలో అభివృద్ధి, సంక్షేమం

పాయకరావుపేట : సంక్షేమానికి తోడుగా రాష్ట్రంలో అన్ని రంగాల్లోను అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. మంగవరం గ్రామంలో రూ.20 లక్షల ఎంపీ నిధులతో నిర్మించ తలపెట్టిన సామాజిక భవనానికి స్థానిక ఎమ్మెల్యే, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన గొల్ల బాబూరావు, నియోజకవర్గ సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. గొల్ల బాబూరావు, కంబాల జోగులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి గ్రామంలోను రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయం, ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేసి సేవలందిస్తున్నారని, రోడ్లు, మౌలిక వసతుల కల్పనతో పాటు ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తున్నామని, నాడు - నేడు ద్వారా పాఠశాలలు, పీహెచ్‌సీలు అభివృద్ధి చేయడం జరిగిందని తెలిపారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో మరలా జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా,పీఏసీఎస్ చైర్మన్ దేవవరపు రాజేష్ ఖన్నా, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు వంగలపూడి సరస్వతీ రామారావు, గూటూరు విజయలక్ష్మి రామగోవిందు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఎంపీడీవో కె.స్వప్న, ఎంఆర్‌వో సూర్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శులు వై.అన్నవరం, పీఆర్ ఏఈ కచేరీ, గ్రామ కార్యదర్శి నరేష్ పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డు కోసం ఆందోళన

మునగపాక : గవర్ల అనకాపల్లి వద్ద అప్రోచ్ రోడ్డు అందుబాటులోకి వచ్చేలా చూడాలని కోరుతూ బుధవారం టీడీపీ నేతలు ఆందోళన చేశారు. గవర్ల అనకాపల్లి వద్ద కాలువపై బ్రిడ్జి నిర్మించి ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు అప్రోచ్‌రోడ్డు అందుబాటులోకి రాకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని టీడీపీ నేతలు శ్రీనివాసరావు, నాయుడు అన్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

తాగునీటి సమస్య రాకుండా చర్యలు

మునగపాక : గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని తిమ్మరాజుపేట ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అన్నారు. తిమ్మరాజుపేటలో మరమ్మతుకు గురైన మంచి నీటి బోర్లను ఆయన బుధవారం అందుబాటులోకి తీసుకువచ్చారు. సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి సహకారంతో గ్రామంలో సమస్యలపై దృష్టి సారిస్తామన్నారు.

రసాయన పరిశ్రమల్లో విపత్తులు, జాగ్రత్తలపై అవగాహన నేడు

రాంబిల్లి: వసంత కెమికల్స్ కంపెనీలో గురువారం రసాయన పరిశ్రమల్లో విపత్తులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో విపత్తులు ఎలా సంభవిస్తాయి..ఎలా ఎదుర్కోవాలన్న దానిపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి

- రూ.4.86 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డుకు ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభోత్సవం



దిమిలి పీహెచ్‌సీలో అదనపు భవనాల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు



మునగపాకలో బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



ట్రాక్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే



లబ్ధిదారుకు రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు, సుకుమారవర్మ



అచ్యుతాపురం : జగ్గన్నపేటలో అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

మునగపాక : వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో రహదారుల అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు(కన్నబాబు)అన్నారు. మునగపాక నుంచి పెదపాడు మీదుగా కశింకోట మండలం వెదురుపర్తి వరకు 8 కిలోమీటర్ల మేర పీఎంజీఎస్‌వై పథకం కింద రూ.4.86 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డును ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల కమతాలకు వెళ్లేందుకు ఇటువంటి రహదారులు ఎంతగానో దోహదపడతాయన్నారు. కశింకోటకు వెళ్లేందుకు దూరం కూడా తగ్గుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు కాశీబాబు, నూకరాజు, శ్రీరామమూర్తి, త్రిమూర్తులు, పిల్లి అప్పారావు పాల్గొన్నారు.

అదనపు భవనాలకు భూమి పూజ

రాంబిల్లి: దిమిలి పీహెచ్‌సీలో బుధవారం అదనపు భవన నిర్మాణ పనులకు సంబంధించి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు (కన్నబాబు)బుధవారం భూమి నిర్వహించారు. టయోట్స్ కంపెనీ సీఎస్ఆర్ కింద రూ.25 లక్షలు భవన నిర్మాణ పనులకు కేటాయించింది. దిమిలి పంచాయతీకి పారిశుద్ధ్య పనులకు వినియోగించేందుకు రూ.8.5 లక్షలతో ట్రాక్టర్‌ను అందించింది. సర్పంచ్ బంగారు చిలుకుకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ట్రాక్టర్‌ను అందజేశారు.

లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

జగనన్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలతో లబ్ధిదారులకు సంపూర్ణ హక్కు దక్కుతుందని ఎమ్మెల్యే కన్నబాబు అన్నారు. రాంబిల్లి, దిమిలి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో బుధవారం ఆయన మండలంలో పలు గ్రామాలకు చెందిన జగనన్న ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ నాగరాజు, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, వైస్ ఎంపీపీ లక్ష్మీవడ్డికాసులు, సర్పంచ్ చిలుకు, ఉప సర్పంచ్ మురళీకృష్ణ, తహసీల్దార్ అప్పల స్వామి, ఎంపీడీవో వెంకటాచలం, డీఎంహెచ్‌వో హేమంత్, దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి వెంకటేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కన్నబాబు బుధవారం పాల్గొన్నారు. మోసయ్యపేట పంచాయతీ పరిధిలో కేజీబీవీ పాఠశాల వద్ద సీసీ రోడ్డును ప్రారంభించారు. జగ్గన్నపేటలో అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. సుకుమారవర్మ, కోన బుజ్జి, దేశంశెట్టి శంకరరావు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై చర్యకు డిమాండ్

మునగపాక : మైనర్ బాలికపై అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు దుర్గా ప్రసాద్‌ను కఠినంగా శిక్షించాలని కోరుతూ బుధవారం ఐద్వా ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా ప్రతినిధులు పి.మాణిక్యం, డీడీ వరలక్ష్మి మాట్లాడుతూ మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై సమగ్ర విచారణ జరిపించాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రమణ, తరుణ్ పాల్గొన్నారు.



మునగపాకలో ఆందోళన చేస్తున్న ఐద్వా సభ్యులు

'బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే పార్టీలకే మద్దతు'

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు రాజ్యాధికారం ఇచ్చే పార్టీలకు తమ మద్దతు ఉంటుందని ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు మొల్లి రమణబాబు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డులోని సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా బీసీలను ఓటు బ్యాంక్‌గానే వాడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఉన్నా..రాజకీయంగా వెనుకంజలోనే ఉన్నామని పేర్కొన్నారు. కులవృత్తి పరికరాల కొనుగోలుకు ఇస్తున్న రూ.10వేలను ప్రభుత్వం పెంచాలని కోరారు. సమావేశంలో ఉత్తరాంధ్ర బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు పెద్దపాటి కల్యాణి, ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి పిల్లల శంకర్, ప్రధాన కార్యదర్శి కృష్ణంనాయుడు, అనకాపల్లి జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు జగ్గ అప్పారావు, సిమ్మా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్న భక్తులు

నక్కపల్లి : నక్కపల్లి తాలూకా బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరిగాయి. సుబ్బరామిరెడ్డి కల్యాణ మండపంలో జరిగిన ఈ కార్యక్రమాలకు నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాలకు చెందిన పలువురు దంపతులు హాజరై స్వామివారి వ్రతంలో పాల్గొన్నారు. వేదపండితులు ముందుగా గణపతి పూజ, వేంకటేశ్వర అష్టోత్తరం, లక్ష్మి అష్టోత్తరం కార్యక్రమాలు చేసిన పిదప సత్యనారాయణస్వామి వారి వ్రతాన్ని ఆచరింపజేశారు. ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. వ్రతం అనంతరం అన్న వితరణ జరిపారు. కాగా బ్రాహ్మణ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి దేవవరం గ్రామానికి చెందిన ఇందుకూరి రవిరాజు, సుధారాజు సోదరులు రూ.20 వేలు విరాళంగా అందజేశారు. వారికి సంఘం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు సంఘ నాయకులు డీవీ రామారావు, గొట్టుముక్కల ప్రసాద్, శ్రీపాద ప్రణవ్‌రామ్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఘననివాళి



గంగిరెడ్ల వెంకటరమణకు నివాళులర్పిస్తున్న చిక్కాల రామారావు

పాయకరావుపేట : శ్రీరాంపురం గ్రామానికి చెందిన స్వర్గీయ గంగిరెడ్ల వెంకటరమణకు నాయకులు ఘనంగా నివాళులర్పించారు. గంగిరెడ్ల వెంకటరమణ గ్రామ సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా రైతు సంఘం నాయకుడిగా, వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా పనిచేశారు. గంగిరెడ్ల వెంకటరమణ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లాల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సాయిబాబా, సర్పంచ్‌లు కోటేశ్వరరావు, రామగోవిందు, చేపల నాగమణి తాతాజీ, పాయకరావుపేట ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, యజ్జల సత్యనారాయణ పాల్గొన్నారు.

నేత్రదానంతో నలుగురికి చూపు



జన్మదిన కేక్ కట్ చేస్తున్న సభ్యులు

అనకాపల్లి: నేత్రదానంతో నలుగురికి చూపు ప్రసాదించవచ్చని విశాఖ ఎల్‌వీ. ప్రసాద్ కంటి ఆస్పత్రి కో-ఆర్డినేటర్ కాత్యాయిని అన్నారు. ఏ వయసులో వారైనా నేత్రదానం చేయవచ్చని, చనిపోయిన ఎనిమిది గంటల్లోపు నేత్రాలు తీసుకోవడం జరుగుతుందని చెప్పారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో బుధవారం నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నెలవారీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఒక వ్యక్తి నల్లగుడ్డులో ఐదుపొరలు ఉంటాయని, సదరు వ్యక్తి నేత్రదానం చేస్తే నలుగురికి చూపు అందించిన వారవుతారని వివరించారు. సమావేశంలో సుమారు పదిమంది నేత్రదానం చేయుటకు ముందుకు వచ్చి, పేర్లు నమోదు చేసుకున్నారు. మార్చిలో జన్మదిన వేడుకలు జరుపుకొంటున్న సుమారు 15 మంది సభ్యులకు జన్మదిన వేడుకలను పురస్కరించుకుని కేక్ కట్ చేయించారు. మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. కేవీ గౌరీపతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సుమారు 150 మంది సీనియర్ సిటిజన్ సభ్యులు, కార్యదర్శి వీఎల్‌ఎం శర్మ, కోశాధికారి వెల్లూరి సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు ఎంబీవీ.స్వామి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

25 తేదీలోగా ఉచితవిద్యకు దరఖాస్తు చేసుకోండి



వై మీనాక్షి, ఎంఈవో-1, యలమంచిలి

యలమంచిలి రూరల్ : విద్యాహక్కు చట్టం ప్రకారం యలమంచిలి పట్టణం, మండలంలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఉచిత విద్య కోసం వచ్చే ఏడాది ఒకటో తరగతిలో ప్రవేశాల నిమిత్తం అర్హులైన తల్లిదండ్రులంతా దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో-1 వై మీనాక్షి తెలిపారు. మండల పరిధిలో 14 స్కూళ్లు ఉన్నాయని, స్కూళ్ల వివరాలన్నీ పాఠశాల విద్యాశాఖ పోర్టల్‌లో ఉంటాయని, ఆసక్తి కలిగి,ఆర్థికంగా వెనుకబడిన తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒకటో తరగతిలో అడ్మిట్ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె సూచించారు. ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఐదేళ్లు నిండి ఆరేళ్లలోపు వయసు ఉండాలని, ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు.

డ్రోన్ స్ప్రేయింగ్ లాభదాయకం



కుమ్మరాపల్లిలో డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పిస్తున్న శ్రీకాంతగౌడ



వరిపైరుపై స్ప్రేయింగ్ చేస్తున్న డ్రోన్

రాంబిల్లి : పంటలను ఆశించిన తెగుళ్ల నివారణకు డ్రోన్ సాయంతో స్ప్రేయింగ్ ఎంతో లాభదాయకంగా ఉంటుందని హరిపురం బీసీటీ కేవీకే యాంత్రీకరణ శాస్త్రవేత్త శ్రీకాంతగౌడ అన్నారు. కుమ్మరాపల్లిలో కోరమండల్ కంపెనీ డ్రోన్ సహకారంతో వరిపైరుపై రసాయన మందు పిచికారీ చేశారు. అలాగే డ్రోన్ స్ప్రేయింగ్‌పై అవగాహన కల్పించారు. డ్రోన్ స్ప్రేయింగ్‌తో ఖర్చు , సమయం ఆదా అవుతుందన్నారు. సాగులో యంత్ర వినియోగంపై రైతులు దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బుర్ల శ్రీహరిరావు, వాన ప్రసాదరావు, కోరమండల కంపెనీ ప్రతినిధులు పృధ్వీలాల్, రమేష్‌బాబు, రైతులు పాల్గొన్నారు.